# స్పర్ధ

వీరయ్య కొడుకు కోటయ్య. వీళ్ళిద్దరికీ స్పర్ధ రావటం ఊళ్లో అందరికీ ఆశ్చర్యంగానే వుంది. చాలాకాలం వరకూ తండ్రీ కొడుకులు చాలా అన్యోన్యంగా వుండేవారు అన్యోన్యము అంటే తండ్రి చెప్పినట్టు కొడుకు వినేవాడు. ఇప్పుడా పరిస్థితి మారింది—ఈ మధ్య వీరయ్య భార్య చనిపోవటం, అతడు మళ్ళీ పెళ్ళి చేసుకోవటం జరిగింది. అంతకుముందే కోటయ్య పెళ్ళి అయింది. అప్పటినుంచీ తండ్రీ కొడుకుల మధ్య స్పర్ధ పెరిగింది. ఉన్న పూరిగుడిసె చెరిసగం చేసుకొన్నారు. చెరొక ఏభై రూపాయలూ పంచుకున్నారు తన యాభై రూపాయలూ పెట్టి వీరయ్య వెంటనే ఒక గేదెను కొన్నాడు. అతని భార్య పాలూ, పెరుగూ అమ్మటంమొదలుపెట్టింది అది చూచి సహించలేక, కోటయ్య భార్య పోరిపోరి భర్తతో తను ఒక గేదెను కొనిపించింది. అప్పటినుంచి మరీ స్పర్ధ ఎక్కువైంది. మేత వెయ్యటం మొదలుకొని, పాలు అమ్ముకొనటం వరకూ రోజూ తగాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆనాడు అయిదు గంటలకు లేచి గేదెకు మేత వెయ్యటానికి దొడ్లోకి వెళ్ళాడు కోటయ్య. తమ గేదెకంటె మామగారి గేదె ఎక్కువ పాలిస్తూ వుందనీ, తమ గేదెకు పోషణ సరిగ్గాజరగటంలేదనీ,భార్యపోరితే కోటయ్య అప్పటినుంచి గేదెకు తనే మేత వెయ్యటం కుదిరి పెట్టటం చేస్తున్నాడు, గేదెకు జనపకట్ట వేద్దామని వామి దగ్గరకు వెళ్ళాడు. దాని ప్రక్కనే తన తండ్రి వామి వుంది. తండ్రి వామిని చూచేటప్పటికి అతనికొక దురాలోచన కలిగింది. తన తండ్రి పుంది జనపకట్టలు పోగుజేశాడు. తన గేదెకు ఆ జనపకట్టవే సే—యీ ఆలోచన తట్టీ తట్టటంతోనే అతి భయంకరంగా కనిపించింది కోటయ్యకి. నెమ్మదిగా అలవాటయినది. తన తండ్రి వామి దగ్గరకు వెళ్ళాడు. ఒక జనపకట్ట లాగాడు రెండడుగులు వేశాడు. ఎదురుగా

తండ్రి కనిపించాడు. ఎందుకనో ఆ జనపకట్టతో తండ్రిని బామదామని పించింది. జనపకట్ట చేత్తో పట్టుకొని రోషంగా చూశాడు. వీరయ్య ఏమను కున్నాడో! అక్కడనుంచి నెమ్మదిగా వెళ్ళిపోయాడు. గబగబా జనపకట్ట గేదెముందు దులిపి గుడిసెలోకి వచ్చి పడుకున్నాడు కోటయ్య.

తెల్లవారేటప్పటికి ఈ సంగతి ఎట్లా తెలిసిందో వీరయ్య భార్యకు తెలిసింది. వీరయ్య యింట్లోలేడు. వీరయ్య భార్య ఈ సంగతి తెలిసీ తెలి యటంతోనే దొడ్డిలోకి వెళ్ళి కోటయ్య వామిలోనుంచి నాలుగుకట్టలు లాగి తన గేదెకు వేసింది. ఈ సంగతి కోటయ్య భార్యకు తెలిసి తగాదా పెట్టు కుంది.

"నీ చెయ్యి విరగా—"

"నీ మొగుడెందుకు చేశాడే?"

"నా మొగుడు చేశాడా?"

"మా జనపకట్ట లాగి—

"రుజువు చెయ్యి!"

వీరయ్య భార్య ప్రక్క గుడిసెలో కాపురం వుంటున్న రత్తయ్యని పిలిచి రుజువు చేసింది. అంతా చెప్పి, "రత్తయ్య మామకూడా చూశాడు" అని చెప్పింది. అక్కడితో మరీ రేగింది కోటయ్య భార్య. మమ్మల్ని ఇంట్లో వుండకుండా చెయ్యడానికని ఈ పన్నాగం పన్నావన్నది. వాడకట్టు వాళ్ళందర్నీ కూడగట్టుకుంటావన్నది. అంతా నీ పక్షం పలక్క, దిక్కులేని పక్షిని నా పక్షం ఎవరు పలుకుతారన్నది నాకేక్షి- అండా దండా అన్నది. అక్కడితో వీరయ్యభార్య వేసుకుంది. మళ్ళీ జుట్టూ జుట్టూ వేసుకున్నారు. వాడకట్టంతా పోగైంది. ఎవ్వరికి చెప్పేవి వారికిచెప్పి అప్పటికి సర్దారు.

కోటయ్య భార్యకు కోపం ఆగలేదు. ఇంట్లోకి వచ్చి మొగుడి మీదకు రేగింది. 'దీనికంతకూ నీ మెత్తదనమే కారణం' అని బిగ్గరగా

ఏడ్చింది. దొంగతనాలుకట్టినా రంకుతనాలు కట్టినా నీకు పట్టనట్టు కూర్చుంటావు. ఒక్క ఆడదాన్ని నా వల్ల ఏమవుతుంది? అని ఏడ్చింది. కాని కోటయ్య 'కిం' అనలేదు. 'కిమ్' అనలేదు. తలనిండా ముసుగు పెట్టుకొని పడుకున్నాడు పడుకున్నట్టే వున్నాడు

వీరయ్య ఎక్కడెక్కడ తిరిగాడో సాయంకాలం ఇంటికి వొచ్చాడు. వొచ్చి రావటంతోనే సంగతంతా పసికట్టాడు. కోటయ్య భార్య అతనికి విన బడేటట్లు తిట్లు ప్రారంభించింది. ఆ తిట్లు విని వీరయ్య భార్య జయ్యిన లేచింది. తోకతొక్కిన పాములే. ఇద్దరూ మళ్ళీ లడాయి వేసుకున్నారు. పాతపాటే అయినా మళ్ళీ వాడకట్టంతా చుట్టుముట్టింది. వీరయ్యకు కోపం వచ్చింది. నోరుమూసుకు లోపలకు వెళ్ళు" అని గదమాయించాడు భార్యని

"దొంగతనం చేస్తుంటే!" అని అరచింది.

"ఎవరు దొంగతనం చేసింది?"

"నీ కొడుకు"

"ఎవరు చెప్పారు?"

"నువ్వు చెప్పకపోతే దాగుతుందనుకున్నావా?" అన్నది భార్య.

"ఎవరు చెప్పారు?"

"రత్తయ్య"

"వాడి మాట ఎందుకు నమ్మావ్?"

"ఒకరు చెప్పేదేమిటి ఇంతంత ఆకు వాళ్ళకాడ ఎక్కడిదీ?" అని కోటయ్య గేదె ముందున్న జనపకాడ చూపించింది.

"వెళుతూ నేనే మన జనపకట్ట ఒకటి వేసి వెళ్ళాను. దీనికింత గోలేమిటి" అన్నాడు వీరయ్య.

"చూచారా, చూచారా....ఎంత పన్నాగం పన్నిందో .... ఈ గుడిసెలో, మేముండటం ఇష్టంలేక ఇదొకటి వేయించింది—" అని అక్కడ పోగయిన వారందరికీ యధార్ధాన్ని తెలియజెప్పింది కోటయ్య భార్య .... చెప్పి మొగుడు దగ్గరకు పరుగెత్తింది.

"చూశారా!" అన్నది. ముసుగు పెట్టుకొని పడుకున్న కోటయ్య మాటాడలేదు.

"మీ నాన్న వొచ్చాడు. వున్నది వున్నట్టు చెప్పాడు" అన్నది.

"ఏం చెప్పాడు?" అంటూ మంచంమీదనుంచి ఉలికిపడి లేచాడు కోటయ్య.

"మన గేదెకు తన జనపకట్ట తనేవేసి వెళ్ళాడట" అన్నది భార్య.

ఈ మాట వినగానే కోటయ్య మళ్ళీ గబుక్కున ముసుగు పెట్టుకుని పడుకున్నాడు. భార్య చిలువలు, పలవలు చేసి చెబుతూనే వుంది. అత్తను తిడుతూనేవుంది. అతను మాత్రం వేసిన ముసుగు తియ్యలేదు.